ఏడాదైనా పనుల జాడలేదు..

- ఐదు పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు
- పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- బిల్లులు రావేమోనని భయం!


అద్దె భవనంలో కొనసాగుతున్న చిన్నయానం పంచాయతీ కార్యాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మించడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. ఉపాధిహామీ పథకం కింద మంజూరు కావడంతో బిల్లులు త్వరగా రావనే కారణంతో వెనకడుగు వేస్తున్నారు. దీంతో కొత్త భవనాల నిర్మాణం ఇప్పట్లో జరిగే పరిస్థితి కనిపించడం లేదు. డొంకేశ్వర్ మండలంలో పలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు శిథిలావస్థలో ఉండగా, కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే.. మారంపల్లి, తొండాకూర్, జీజీ నడ్కుడ, చిన్నయానం, కోమట్‌పల్లి కలిపి మొత్తం ఐదు పంచాయతీలకు సొంత భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం గతేడాది జూలైలో ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో భవనానికి రూ.20లక్షలు మంజూరు చేయగా, వీటి నిర్మాణ బాధ్యత పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. ప్రస్తుతం ఒక్క తొండాకూర్‌లోనే పంచాయతీ బిల్డింగ్ పనులు ప్రారంభం కాగా, స్లాబ్ లెవల్ వరకు నిర్మించి బిల్లులు రాకపోవడంతో పనులను ఆపేశారు. మారంపల్లిలో పాత పంచాయతీ భవనాన్ని కూల్చివేసి పనులకు కొబ్బరికాయ కొట్టినా ఇంత వరకు ప్రారంభం కాలేదు. దీంతో ఈ గ్రామంలో పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. పాలకవర్గ సమావేశాలకు, పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందిగా మారింది. అదే విధంగా జీజీ నడ్కుడ, చిన్నయానం, కోమట్‌పల్లి గ్రామాల్లోనైతే పనులకు కనీసం కొబ్బరికాయ కూడా కొట్టలేదు. చిన్నయానం, కోమట్‌పల్లి పంచాయతీలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.

నామినేటెడ్ పద్ధతిలోనే పనులు

ఉపాధిహామీ నిధులతో మండలంలో ఐదు పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మించాల్సి ఉంది. టెండరు పద్ధతిలో కాకుండా నామినేటెడ్ పద్ధతిలోనే జీపీ తీర్మానం చేసి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగిస్తారు. అయితే.. ఈజీఎస్ బిల్లులు రావడం ఆలస్యమవుతుండడంతో కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్నారు. తాము ఈ పనులు చేయలేమని పంచాయతీరాజ్ అధికారులతో స్పష్టం చేస్తున్నారు. బతిమిలాడినా ససేమిరా అనడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. ఎస్టిమేషన్ విలువను పెంచాలనే డిమాండ్ కూడా ఉంది. ఉన్నతాధికారులు చొరవచూపి పంచాయతీ భవనాలను నిర్మింపజేయాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇటు పంచాయతీరాజ్ ఏఈ బాలాజీని 'సాక్షి' వివరణ కోరగా.. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం ప్రధాన సమస్యగా మారిందని, ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఘనంగా సంక్రాంతి


చందూరులో పశువుల దొడ్డి నిర్వహిస్తున్న రైతులు


సాలూరలోని వ్యవసాయ భూమిలో పూజలు..


వాకిట్లో పాలు పొంగిస్తున్న దృశ్యం

సాక్షి నెట్‌వర్క్: సంక్రాంతి సంబురాలు మూడు రోజులపాటు ఘనంగా కొనసాగాయి. సోమవారం సంక్రాంతి సందర్భంగా వాకిళ్ల భోగిమంటలు, పాలపొంగులు, రంగురంగుల ముగ్గులతో కళకళలాడాయి. చిన్నాపెద్ద తేడా లేకుండా పోటాపోటీగా పతంగులను ఎగురవేశారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహారాష్ట్ర సరిహద్దులోని మంజీర తీరాన ఉన్న బోధన్ పాత రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల ప్రజలు సంక్రాంతి పండుగ ను వైవిధ్యంగా జరుపుకున్నారు. రైతులు కుటుంబ సభ్యులతో కలిసి పంటపొలాల్లోకి వెళ్లి పంచపాండవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే భోజనాలు చేశారు. కనుమ సందర్భంగా మంగళవారం పశువులకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.


ఆర్మూర్‌లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు



ఆర్మూర్ పట్టణంలో గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులు

క్రీడల్లో సత్తా చాటాలి

బాల్కొండ: క్రీడల్లో సత్తా చాటాలని గురుకుల సొసైటీ పాఠశాల కోచ్ సీనియర్ పీడీ సంజీవ్ అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాలలో అండర్ – 14, అండర్ – 17 ఖోఖో పోటీల శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్వహించే తెలంగాణ గురుకుల సొసైటీ పాఠశాలలో ఖోఖో క్రీడల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కబడ్డీ జాతీయ క్రీడాకారుడు గంగాధర్, పీడీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాల విద్యార్థులతో కోచ్‌లు

జైపాల్‌రెడ్డికి నివాళులు

మాక్లూర్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్‌రెడ్డి జయంతి కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డితోపాటు నాయకులు పాల్గొన్నారు. జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాక్లూర్ మండల కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌గౌడ్, బి దయాకర్‌రావు, రాజేశ్వర్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని ఆంధ్రనగర్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరిస్తారని సర్పంచ్ నాయకుడు రామారావు, ఎంపీటీసీ గింజుపల్లి రాధాశ్రీనివాస్ తెలిపారు. మంత్రితోపాటు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్ నుంచి నిర్వహించనున్న ర్యాలీలో నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ ప్రజలకు గురువారం తాగునీటిని సరఫరాను నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నామని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

రుద్రూర్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని పొతంగల్ మండలం చేతన్‌నగర్, హెగ్డోలి గ్రామాల్లో నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి మారుతి, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి, జీపీ కార్యదర్శులు నవీన్, జగదీశ్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


హెగ్డోలిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జాగృతి సంచికల పంపిణీ



రెంజల్/నవీపేట్(బోధన్): అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ప్రచురించిన జాగృతి పత్రిక సంచికను మంగళవారం రెంజల్ మండలం నీల, నవీపేటలో పంపిణీ చేశారు. నీలాలో వెయ్యి కుటుంబాలకు, నవీపేటలో 1750 కుటుంబాలకు సంచికలను అందజేశారు. నీలాకు కేఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోయ సాంబశివరావు, నవీపేటకు కేశవ ప్రభాత్ సంచికలను పంపించారు.

మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సాజిద్



ఆర్మూర్‌టౌన్: పట్టణ కాంగ్రెస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ సాజిద్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ మహ్మద్ ఇర్ఫాన్ అలీ మంగళవారం సాజిద్‌కు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు ఈ సందర్భంగా సాజిద్ కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



బోధన్: సంక్రాంతిని పురస్కరించుకొని సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్దన్ అధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సాలూర క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -3 మంగళవారం ముగిసింది. ఉమ్మడి బోధన్ మండల స్థాయి టోర్నీని మూడేళ్లుగా సొసైటీ చైర్మన్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 28 టీములు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో సాలూర, పెగడాపల్లి టీంలు తలపడగా, సాలూర టీం విజయం సాధించింది. విన్నర్, రన్నర్ జట్లకు నగదు ప్రోత్సాహకం, షీల్డ్‌లను సర్పంచ్ భయ్యన్ చంద్రకళ, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ అందజేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనుల పరిశీలన

రుద్రూర్: కోటగిరిలో కొనసాగుతున్న 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతువిభాగం నాయకుడు కొల్లూర్ కిశోర్ బాబును అంతకు ముందు పోచారం పరామర్శించారు. ఆయనతోపాటు గాయాలైన పార్టీ నాయకులకు ఫోన్ చేసి ఆరోగ్య సమాచారాన్ని, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ పత్తి లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, విండో చైర్మన్ కూచి సిద్దు తదితరులున్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


చిక్కడపల్లిలో ముగ్గుల పోటీ..


బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ పుష్పలత

ఆర్మూర్‌టౌన్/పెర్కిట్/వేల్పూర్/కమ్మర్‌పల్లి/రుద్రూర్: సంక్రాంతి సంబురాల్లో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, వీడీసీలు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్మూర్‌లోని జిరాయత్ నగర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్, హనుమాన్ మందిర కమిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి విజేతలకు క్లబ్ అధ్యక్షుడు, ప్రాజెక్ట్ చైర్మన్ ప ట్వారీ గోపికృష్ణ, సభ్యులు బహుమతులు అందజేశారు. మామిడిపల్లిలోని వేంకటేశ్వకాలనీలో గీర్వా ణి అనే యువతి సీతారాముల చిత్రాలతో వేసిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేల్పూర్ మండలం పడగల్‌లో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో, కమ్మర్‌పల్లిలో వీడీసీ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో, రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లిలో సర్పంచ్ పుష్పలతరమేశ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.


ఆర్మూర్‌లో బహుమతుల ప్రదానం


కమ్మర్‌పల్లిలో..

ఆధ్యాత్మికం..

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆజాంగంజ్ రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన వారితోపాటు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి అశోక్‌కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మెట్ల పూజ



బాల్కొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మణికంఠుని పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆభరణాలను గ్రామంలో ఊరేగించి మెట్ల పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. అలాగే జలాల్‌పూర్‌పూర్ గ్రామంలో అయ్యప్ప ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు.

రాములోరి అక్షింతల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్‌లో అయోధ్య రాములోరి అక్షింతలను సోమవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. జైశ్రీరామ్ నినాదాలతో గ్రామం మారుమోగింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



బోధన్‌రూరల్(బోధన్): బోధన్ పట్టణంలోని హనుమాన్ టేక్డీ కాలనీలో ఉన్న చక్రేశ్వర శివాలయం ఆలయ ప్రధానార్చకుడు గణేశ్‌శర్మ స్వగృహంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్తరాయణం ప్రారంభమైన నేపథ్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ప్రముఖ అర్చకులు, వేద పండితులు గణేశ్‌మహారాజ్, ఉదయ్ కిరణ్‌శర్మ, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

సమాచారం..


19న మండల సమావేశం

రుద్రూర్: కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల పరిషత కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీ పీ వల్లేపల్లి సునీతశ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం ఉంటుందని, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మాక్లూర్ సొసైటీ చైర్మన్ ఎన్నిక వాయిదా

మాక్లూర్: సహకార సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక బుధవారం నిర్వహించాల్సి ఉండగా, ఎన్నిక ప్రక్రియ వాయిదా పడినట్లు డీసీవో సింహాచలం మంగళవారం తెలిపారు. స్టేట్ కార్పొరేషన్ నుంచి మంగళవారం రాత్రి అందిన ఆదేశాల మేరకు ఎన్నిక ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ నుంచి వచ్చే ఆదేశాల మేరకు తరువాత ఎన్నిక నిర్వహిస్తామని డీసీవో వెల్లడించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – సైంధవ్ (తెలుగు)- 10.00, 1.00, 7.05, 10.05 మేరి క్రిస్మస్ (తెలుగు) 4.00
- స్క్రీన్-2 – గుంటూరు కారం (తెలుగు)- 9.00, 12.20, 3.40, 7.00, 10.20
- స్క్రీన్-3 – గుంటూరు కారం (తెలుగు)- 09.10, 12.30, 3.50, 7.10, 10.30 నా సామిరంగ (తెలుగు) 10.45
- స్క్రీన్-4 – నా సామిరంగ (తెలుగు)- 10.20, 1.30, 4.40, 7.50 హనుమాన్ (తెలుగు) - 10.20

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో కొనసాగుతున్న అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం సింగిరెడ్డి జలపతిరెడ్డి రూ.50116 విరాళం అందజేశారు. దాతకు ఆలయ కమిటీ సభ్యులు రసీదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బద్రి, రాజేశ్, జైపాల్, చింత గణేశ్, సంత రాజేశ్వర్ పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహావిష్కరణ



మోర్తాడ్: విప్లవ వీరుడు, ఆదివాసి ఉద్యమకారుడు కుమురం భీం విగ్రహాన్ని మండలంలోని ధర్మోరాలో మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, ప్రధాన కార్యదర్శి గంగాసాయన్న, కామారెడ్డి డీఆర్డీవో గాము సాయన్న, సంఘం ప్రతినిధులు లోలం గంగాధర్, దాత్రి అంజయ్య, పుట్ట రాజేశ్వర్, కొసెడుగు రవి, కొంద్రు నవీన్, తుమ్మల శ్రీనివాస్, కంచు సతీష్, బోండ్ల లింబాద్రి, జంబోతుల సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుక



రుద్రూర్: బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి జన్మదిన వేడుకను కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. బాన్సువాడ నియోజకవర్గ బీఎస్పీ ప్రధాన కార్యదర్శి దాసరి శ్యాం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. రుద్రూర్, కోటగిరి, వర్ని, పొతంగల్ మండలాల పార్టీ అధ్యక్షులు గౌతమ్ కాంబ్లే, ఇందూర్ సాయిలు, నామ్ రాము, గులాబ్, నాయకులు బండారి చరణ్, పవన్ సూర్యవంశీ, విద్యాసాగర్, సాయిలు, రాజేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'అవ్వకు బువ్వ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల పేద వృద్ధులకు 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేశ్ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 54 మంది పేద వృద్ధులకు బియ్యం అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్‌పవార్, సంస్థ ఉపాధ్యక్షుడు జిందమ్ నరహరి, విద్యాగోపి పట్వారి, కోశాధికారి గోనె శ్రీధర్, బేతు గంగాధర్, ఖాందేశ్ సత్యం, తులసి పట్వారి, సాయినాథ్, మీరా శ్రావణ్, సభ్యులు పాల్గొన్నారు.

18న సీపీఐ సమావేశం



రుద్రూర్: ఈ నెల 18న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ పార్లమెంటరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ పిలుపునిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవార ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో పోటీ చేయనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తున్నామని, సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ హాజరవుతారన్నారు. నిజామాబాద్‌పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల సీపీఐ శాఖ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్, నాయకులు నల్ల గంగాధర్, బర్ల సునీల్‌కుమార్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వేల్పూర్: మండల కేంద్రానికి చెందిన తోపారం దీపక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి స్థానిక చేయూత ఫౌండేషన్ తరపున మంగళవారం రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సభ్యులు నవీన్, సురేశ్, బాలు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.